సాక్షి వికారాబాద్

ఆదివారం । 25 । మే । 2025



సమన్వయంతో సర్వే పూర్తి

దుద్యాల్ మండలంలో పారిశ్రామికవాడ కోసం సేకరించిన భూముల్లో చేపట్టిన సర్వే శనివారంతో పూర్తయ్యింది. 8లో▸



త్వరగా పూర్తి చేయండి

వికారాబాద్ రైతుబజార్‌లో చేపట్టిన పెడ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్ కోరారు. 8లో▸



గ్రామీణ రోడ్లకు మహర్దశ

పల్లెదారుల విస్తరణకు మోక్షం కలిగింది. సింగిల్ రోడ్లను డబుల్‌గా మార్చే పనులు చురుగ్గా సాగుతున్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

ఎస్సీ గురుకులాల మూసివేత నిర్ణయం సరికాదు

కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య

యాలాల: రాష్ట్ర వ్యాప్తంగా 12 ఎస్సీ గురుకుల జూనియర్ కళాశాలలను మూసివేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య డిమాండ్ చేశారు. యాలాల మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు లేరనే సాకుతో కళాశాలలను మూసివేయాలని చూడటం సరికాదన్నారు. అడ్మిషన్ల ప్రక్రియ ఆలస్యం కావడంతోనే గురుకులాల్లో విద్యార్థులు చేరలేకపోతున్నారని పేర్కొన్నారు. గురుకులాలు మూసివేస్తే పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. లేనిపక్షంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లోనే

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉంటుందని ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం పరిగి పట్టణంలోని నంబర్ వన్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా బోధన చేయాలని సూచించారు. విద్యాభివృద్ధికి తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని పేర్కొన్నారు. మండలంలో 300 మందికి సరిపడే ఒక రిసార్ట్ సెంటర్‌ను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం పరిగి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి నాగుల శిల్ప మాట్లాడుతూ.. లింగ సమానత్వం, అందరికీ ఉచిత నిర్బంధ విద్య అందేలా కృషి చేయాలని సూచించారు. విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మాజీ సైనికులను సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి గోపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, నాయకులు పార్థసారథి, ఎర్రగడ్డపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం సభను జయప్రదం చేద్దాం

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్



చలో ఖమ్మం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పరిగి: గిరిజనుల హక్కుల సాధన కోసం జూన్ 8న ఖమ్మంలో నిర్వహించే సభను జయప్రదం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్ పిలుపునిచ్చారు. శనివారం పరిగి పట్టణంలో చలో ఖమ్మం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఖమ్మం సభలో గిరిజనుల సమస్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. గిరిజనుల భాషను అధికారిక భాషగా గుర్తించాలని డిమాండ్ చేయనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీల రిజర్వేషన్‌ను 14శాతానికి పెంచాలని కోరారు. గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ జయంతిని ప్రభుత్వం సాధారణ సెలవుగా ప్రకటించాలన్నారు. ఖమ్మం సభకు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాండు నాయక్, గట్ట్యా నాయక్, హరినాయక్ తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ జిల్లా టాపర్ తేజస్విని



అనంతగిరి: పాలిసెట్ ప్రవేశ పరీక్ష ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఎంపీసీ విభాగంలో 82.84 శాతం, ఎంబైపీసీ విభాగంలో 85.49 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని జిల్లా పాలిసెట్ కన్వీనర్ రవీందర్ తెలిపారు. జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. తాండూరుకు చెందిన జి.తేజస్విని ఎంబైపీసీ, ఎంపీసీ రెండు విభాగాల్లోనూ జిల్లా మొదటి ర్యాంక్ సాధించింది. ఎంబైపీసీలో వికారాబాద్‌కు చెందిన టీ శ్రీమనోజ్ రెండో ర్యాంక్ సాధించగా, జి.అభిజ్ఞ మూడో ర్యాంక్ సాధించింది. ఎంపీసీ విభాగంలోనూ అభిజ్ఞ రెండో ర్యాంక్‌తో సత్తా చాటగా.. టి.వర్షిత్‌రెడ్డి మూడో ర్యాంక్ సాధించారు.



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

బోనమెత్తిన జనగాం

పెద్దేముల్ మండలం జనగాంలో బీరప్ప స్వామి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనమెత్తి ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించారు. శివసత్తుల శిగాలు, పోతరాజుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆదివారం స్వామివారి కల్యాణం ఉంటుందని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు.

– తాండూరు రూరల్



పోత రాజుల విన్యాసం

అభివృద్ధి తూచ్..!

నిధుల మంజూరు కాగితాల్లోనే..

- శంకుస్థాపనలతో సరిపెడుతున్న ఎమ్మెల్యేలు
- సీసీ రోడ్లు, డ్రైనేజీలకే పరిమితం
- సీఎం నియోజకవర్గంలోనే పనులు వేగిరం
- మిగతా చోట్ల ఎక్కడ వేసిన గొంగళి అక్కడే
- ఇటీవల రెండు సార్లు ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ కోరిన శాసనసభ్యులు
- ఇచ్చి రద్దు చేసిన సీఎం పేషీ

వికారాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న జిల్లాలో అభివృద్ధి పడకేసింది.. నిధులు మంజూరైనట్లు నేతలు చెబుతున్నా డెవలప్‌మెంట్ మచ్చుకైనా కనిపించడం లేదు. అభివృద్ధి పనులకు ఆర్భాటంగా శంకుస్థాపనలు చేస్తున్న ఎమ్మెల్యేలు ఆ తర్వాత పనులను ప్రారంభించడం లేదు. ఏడాది కాలంగా నిధుల మంజూరు పేరిట ఎమ్మెల్యేలు హడావుడి చేస్తున్నారు. ఐదు నెలల క్రితం వారివారి ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వివిధ పనులకు శంకుస్థాపనలు చేశారు. వారం పది రోజుల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి నిర్మాణాలను ప్రారంభిస్తామని చెప్పారు. కానీ ఎక్కడా ఆ దిశగా ముందడుగు పడలేదు. అధికారులు కూడా ఇదే పాట పాడుతున్నారు. జిల్లాలోని వికారాబాద్, పరిగి, తాండూరులో నియోజకవర్గాల్లో అభివృద్ధి కుంటుపడింది. సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌లో మాత్రం పనులు వేగంగా జరుగుతున్నాయి. సీసీ రోడ్లు, డ్రైనేజీలు మినహా పెద్దగా పురోగతి కనిపించడం లేదు. కొడంగల్ ప్రాంతానికి రూ.6వేల కోట్లకు పైగా నిధులు మంజూరు కాగా జిల్లాలోని మిగిలిన మూడు నియోజకవర్గాలకు రూ.500 కోట్ల నుంచి రూ.600 కోట్ల వరకు నిధులు మంజూరయ్యాయి. వీటితోనే సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపడుతున్నారు.

మంజూరైన పనులివే..

కొడంగల్‌కు మినహా జిల్లాకు పెద్దగా నిధులు మంజూరైన దాఖలాలు లేవు. పరిగి – షాద్‌నగర్ రోడ్డును కొంత కాలంగా బెంగళూరు – ముంబై హైవే లింకు రోడ్డుగా వినియోగిస్తున్నారు. ప్రస్తుతం దీన్ని నాలుగు లేన్ల రహదారిగా విస్తరించాలని నిర్ణయించిన ప్రభుత్వం రూ.120 కోట్లు మంజూరు చేసింది. పరిగి – వికారాబాద్ రెండు వరుసల రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించేందుకు రూ.120 కోట్లు మంజూరు చేశారు. ఈ మార్గంలో రూ.7 కోట్లతో వంతెన నిర్మించాల్సి ఉంది. పరిగి నియోజకవర్గ పరిధిలోని గడిసింగాపూర్ నుంచి మహబూబ్‌నగర్ జిల్లా గండేడ్ మండల పరిధిలోని రంగారెడ్డిపల్లి వరకు గల రోడ్డును రెండు వరుసల రహదారిగా నిర్మించేందుకు రూ.100 కోట్లు కేటాయించారు. పరిగి పరిధిలోని చిట్టెంపల్లి గేట్ నుంచి కంకల్ మీదుగా షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని లాల్‌పహాడ్ వరకు గల రోడ్డును రెండు వరుసల రహదారిగా అభివృద్ధి చేసేందుకు రూ.30 కోట్లు మంజూరు చేశారు. ఇందుకు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులను ప్రారంభించినా పనులు నత్తను తలపిస్తున్నాయి. పరిగి మండలం తుంకలగడ్డ నుంచి లఖ్నాపూర్ ప్రాజెక్టు వరకు గల సింగిల్ రోడ్డును రూ.7 కోట్లతో రెండు వరుసల రహదారిగా విస్తరించేందుకు నిధులు మంజూరు చేశారు. అలాగే రూ. 101 కోట్లతో వికారాబాద్ – తాండూరు రోడ్డును విస్తరించనున్నారు. ఈ పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ కొనసాగుతుండగా ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతు పనులు చేస్తున్నారు. వీటితో పాటు వికారాబాద్, తాండూరు నియోజకవర్గాల్లో వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కాగా ఎలాంటి పురోగతి కనిపించడం లేదు.



వికారాబాద్ - పరిగి నాలుగు లేన్ల రహదారికి వేసిన శిలాఫలకం

సీఎం అపాయింట్‌మెంట్ రెండుసార్లు రద్దు

ఇటీవల జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసేందుకు రెండు సార్లు ప్రయత్నించారు. ఈ నెల 16న ఒకసారి, మూడు రోజుల క్రితం మరోసారి అపాయింట్‌మెంట్ కోరారు. రెండు సార్లూ అనుమతి వచ్చి తర్వాత క్యాన్సిల్ అయ్యింది. ముఖ్యమంత్రిని కలిసి మరిన్ని పనులు మంజూరు చేయించుకునేందుకు జాబితాను సిద్ధం చేసుకున్నారు. అలాగే గతంలో మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని అభ్యర్థించాలని భావించారు. తీరా సీఎం అపాయింట్‌మెంట్ రద్దు కావడంతో ఎమ్మెల్యేలు నిరాశకు గురయ్యారు. సొంత జిల్లా ఎమ్మెల్యేలకే అపాయింట్‌మెంట్ రాకపోవడంతో ఒకింత అసంతృప్తిగా ఉన్నారు.



మహిళా సంఘం సభ్యులతో సమావేశమైన సెర్ప్ డైరెక్టర్ నవీన్‌కుమార్, ఇతర అధికారులు

మహిళల ఆర్థిక పురోగతే లక్ష్యం

సంఘం సభ్యులు వ్యాపార రంగంలో రాణించాలి

- సెర్ప్ డైరెక్టర్ నవీన్‌కుమార్
- సంఘాల బలోపేతానికి చర్యలు

తాండూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సంఘాల సభ్యులు బ్యాంక్ రుణాలు పొంది ఆర్థిక పురోగతి సాధించాలని సెర్ప్ డైరెక్టర్ నవీన్‌కుమార్ సూచించారు. శనివారం తాండూరు మండలం బెల్కటూర్‌లోని డ్వాక్రా భవనంలో ప్రాజెక్ట్ మేనేజర్ రవీందర్ రావు, స్టేట్ ఎక్జిక్యూటీవ్ కరుణాకర్‌తో కలిసి మహిళా సమాఖ్య సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత మహిళలు డ్వాక్రా సంఘాల్లో చేరాలని కోరారు. తద్వారా బ్యాంక్ రుణాలు పొంది చిన్నచిన్న వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. సంఘంలో సభ్యులుగా లేనివారు భూమి, ఇంటి పత్రాలు పెట్టి బ్యాంకుల్లో రుణాలు పొందవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వం సంఘాల బలోపేతానికి కృషి చేస్తోందని తెలిపారు. పెట్రోల్‌బంక్, పౌల్ట్రీ, పాడి పరిశ్రమలు, రొయ్యలు, చేపలు పరిశ్రమల ఏర్పాటుకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తోందని తెలిపారు. ప్రతి మండలంలో మహిళా శక్తి క్యాంటిన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బెల్కటూరులో 47 సంఘాలు ఉన్నాయని.. ఇందులో తొమ్మిది ఆగిపోయే స్థితిలో ఉన్నట్లు తెలిపారు. ఇందుకు గల కారణాలు తెలుసుకొని వాటిని మళ్లీ యాక్టివ్ అయ్యేలా కృషి చేస్తామన్నారు. ప్రతి సభ్యురాలు పొదుపు చేసుకోవాలని సూచించారు. సంఘంలోని సభ్యులు రోడ్డు ప్రమాదంలో చనిపోతే రూ.10 లక్షల వరకు బీమా వస్తోందని తెలిపారు. అనుకోని కారణాలతో చనిపోతే రూ.2 లక్షల వరకు అప్పు మాఫీ అవుతుందన్నారు. ప్రభుత్వమే సభ్యులకు ఇన్సూరెన్స్ చేయిస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం ఆనంద్, సీసీ సంధ్య, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.



హనీష్‌రెడ్డిని సన్మానిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

శభాష్.. హనీష్

- సైనిక్ స్కూల్ ప్రవేశాల్లో ఆలిండియాలో నాలుగో ర్యాంక్ సాధించిన విద్యార్థి
- అభినందించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

తాండూరు రూరల్: పెద్దేముల్ మండలం కందనెల్లి గ్రామానికి చెందిన రాంరెడ్డి, రాధిక దంపతుల కుమారుడు విద్యార్థి హనీష్‌రెడ్డి సైనిక్ స్కూల్ ప్రవేశాల్లో ఆలిండియాలో నాలుగో ర్యాంక్ సాధించారు. దీంతో బాలుడిని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హనీష్‌రెడ్డి ఆలిండియాలో నాలుగో ర్యాంక్ సాధించడం తెలంగాణ ఖ్యాతిని దేశానికి చాటాడని కొనియాడారు. భవిష్యత్‌లో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. హనీష్ ఆలిండియాలో ర్యాంక్ సాధించడంపై తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పచ్చిరొట్టతో నేలకు సారం



కార్యక్రమానికి హాజరైన శాస్త్రవేత్తలు, రైతులు

- రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి
- వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సుజాత

మోమిన్‌పేట: పచ్చిరొట్ట, సేంద్రియ ఎరువులు వినియోగిస్తే భూ సారం పెరుగుతుందని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కే సుజాత అన్నారు. శనివారం మోమిన్‌పేట రైతు వేదికలో వ్యవసాయ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశోధన స్థానం, తాండురు వారి సంయుక్త ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె యూరియా వాడకాన్ని ఎలా తగ్గించుకోవాలో రైతులకు వివరించారు. పచ్చిరొట్ట పంటలు వేసి భూసారాన్ని పెంచుకోవాలన్నారు. నీటి వృథాను అరికట్టే వివిధ పద్ధతులను వివరించారు. అనంతరం శాస్త్రవేత్త సీ యమున మాట్లాడుతూ.. పంట మార్పిడి, మిశ్రమ పంటల ఉపయోగాలను తెలియజేశారు. రసాయన మందుల వాడకాన్ని తగ్గించి సమగ్ర సస్యరక్షణ పద్ధతులు అవలంబించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, మండల వ్యవసాయ అధి కారి జయశంకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ వై.మహేందర్ రెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ గీత, ఏఈవోలు పెంటయ్య శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బోధన బాధ్యతగా ఉండాలి



ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న స్టేట్ రిసోర్స్ పర్సన్ బాలాజీ

- స్టేట్ రిసోర్స్ పర్సన్ బాలాజీ
- ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం

దుద్యాల్: తరగతి గదిలో నేర్చుకునే ప్రతి అంశం నిజ జీవితంలో ఉపయోగపడేలా బోధన చేయాలని స్టేట్ రిసోర్స్ పర్సన్ కే బాలాజీ సూచించారు. శనివారం మండల కేంద్రంలో కొనసాగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోధన బాధ్యతగా ఉండాలన్నారు. పాఠాలు చెప్పే సమయంలో ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పుస్తకంలోని పాఠం చెప్పడంతో సరిపెట్టకుండా అర్థమయ్యేలా బోధన చేయాలన్నారు. ప్రతి తరగతిలో లోపాలు ఉన్న విద్యార్థులు ఉంటారని, అలాంటి వారిని గుర్తించి సమస్యలు అధిగమించేలా చొరవ చూపాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు చెబితే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు.ఆ దిశగా కృషి చేయాలని సూచించారు. బోధనలో టీఎల్ఎం తప్పనిసరిగా ఉపయోగించాలని అన్నారు. అనంతరం ఎంఈవో విజయరామారావు మాట్లాడుతూ.. ఉపాధ్యా యుడు నిత్య విద్యార్థి అని.. రోజూ ఒక కొత్త విషయాన్ని తెలుసుకొని విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా ఉపాధ్యాయులు తయారు చేసిన టీఎల్ఎంలను ప్రదర్శించారు. కార్యక్రమంలో శిక్షణ శిబిరం డైరెక్టర్ రవీందర్ గౌడ్, ఎంఆర్‌పీలు వెంకటయ్య, శంకరప్ప, సంపత్, అశోక్, తేజస్విని, అస్మా సుల్తానా, అర్షియా తదితరులు పాల్గొన్నారు.

ధారూరు మార్కెట్‌కు 2,422 బస్తాల మొక్కజొన్నలు

ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్‌కు శనివారం 2,422 బస్తాల మొక్కజొన్నలు వచ్చాయని ఏఎంసీ కార్యదర్శి సిద్దమ్మ తెలిపారు. వ్యాపారులు క్వింటాలుకు తక్కువగా రూ.2,170.., మధ్యస్థంగా రూ.2,220.., ఎక్కువగా రూ.2,250 వరకు కొనుగోలు చేశారని తెలిపారు. గత వారంతో పోలిస్తే ఈ వారం క్వింటాలుకు రూ.70 వరకుఉ తగ్గిందని పేర్కొన్నారు. 1010 రకం ధాన్యం 4,038 బస్తాలు రాగా క్వింటాలుకు రూ.1,860, రూ.1,950, రూ.1,980 వరకు, సోనారకం వడ్లు 150 బస్తాలు వచ్చాయని, క్వింటాలుకు రూ.2,000, రూ.2,100, నుంచి రూ.2,230 వరకు వ్యాపారులు కొనుగోలు చేశారని ఆమె వివరించారు.





తిరంగా ర్యాలీలో భాగంగా నాయకుల మానవహారం

వెల్లువెత్తిన జాతీయత

తాండూరు: మనం సైతం దేశం కోసం అంటూ అన్ని వర్గాల ప్రజలు తిరంగా యాత్రతో జాతీయ భావాన్ని చాటుకున్నారు. శనివారం తాండూరులో కాంగ్రెస్, బీజేపీ నాయకులతో పాటు తిరంగా అభియాన్ కమిటీ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర నిర్వహించారు. నేతలు, అసోసియేషన్ ప్రతినిధులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, విద్యార్థులు జాతీయ జెండాలను చేతపట్టి పురవిధుల్లో ర్యాలీ తీశారు. ఇందిరాచౌక్ వద్ద నేతలు ప్రసంగించారు. పార్టీలు వేరైనా దేశం కోసం ఏకమవుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్లు తాటికొండ స్వప్న పరిమళ్, కోట్రికె విజయలక్ష్మి, ఆర్‌బీఎల్ సంస్థ అధినేత బుయ్యాని శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌కుమార్, నాయకులు పట్లోళ్ల నర్సింహులు, భానుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తాత్కాలిక మెరిట్‌లిస్టును చెక్ చేసుకోండి

కొడంగల్ రూరల్: కొడంగల్ మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్‌లో ఉన్న గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలలో రెండు నైట్ వాచ్‌మెన్ పోస్టులకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల తాత్కాలిక మెరిట్ లిస్టును విడుదల చేశామని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు రాజేంద్రనగర్‌లోని గిరిజన గురుకుల పాఠశాలల ప్రధాన కార్యాలయం నందు తాత్కాలిక మెరిట్ లిస్టు ఉంచారని, చెక్ చేసుకోవాలని సూచించారు. అభ్యంతరాలు ఉంటే ఈ నెల 26 నుంచి 28 వరకు అధికారులను సంప్రదించాలన్నారు.

కల్వ సుజాతపై ఫిర్యాదు



తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డికి ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

తాండూరు టౌన్: ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాతపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం బీజేపీ తాండూరు నాయకులు డీఎస్పీ బాలకృష్ణారెడ్డికి ఫిర్యాదు చేశారు. ప్రధాని మోదీ, భారత బలగాలపై ఫేస్‌బుక్‌లో పెట్టిన పోస్టు అవమానకరంగా ఉందని బీజేపీ నాయకులు తెలిపారు. వెంటనే ఆమెపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, నాయకులు పటేల్ విజయ్ తదితరులు ఉన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనంతగిరి: రైలు కిందపడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన వికారాబాద్ రైల్వే ఠాణా పరిధిలో శనివారం వెలుగులోకి వచ్చింది. రైల్వే పోలీసులు తెలిపిన ప్రకారం.. శుక్రవారం అర్ధరాత్రి వికారాబాద్–చిట్టిగడ్డ స్టేషన్ల మధ్య మూసీ నంది బ్రిడ్జిపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం అందింది. వెంటనే ఘటనా స్థలికి వెళ్లి పరిశీలించామని.. మృతుడి వయస్సు 35–40 మధ్యం ఉంటుందని.. ఎరుపు, నలుపు గ్రెంటుకలున్నాయన్నారు. నేవీ బ్లూ చొక్కా, సిమెంట్ కలర్ ప్యాంట్, కంటి అద్దాలు ఉన్నాయని చెప్పారు. మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపరిచామని హెడ్ కానిస్టేబుల్ హరిప్రసాద్ తెలిపారు.

మెయింటెనెన్స్ పేరిట అక్రమ వసూళ్లు

శంకర్‌పల్లి: పట్టణ శివారులోని డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద మెయింటెనెన్స్ పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిపై మున్సిపల్ కమిషనర్ యోగేశ్ ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. యాకుత్‌పురా, కార్వాన్ నియోజకవర్గాలకు చెందిన ఇళ్లు లేని పేదలకు ప్రభుత్వం పట్టణ శివారులో సుమారు 1,500లకు పైగా డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించి కేటాయించింది. వాటిని గత ఏడాది లబ్ధిదారులు కేటాయించారు. ఈ క్రమంలో శంకర్‌పల్లి మండలం మహాలింగాపురం గ్రామానికి చెందిన ఖురేషి భాయ్ అనే వ్యక్తి తనకు ప్రతీ నెల మెయింటెనెన్స్ ఇంటికి రూ.600 చెల్లించాలని బ్యానర్లు ఏర్పాటు చేశాడు. జీహెచ్‌ఎంసీ హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్–3 నివాసితులు శనివారం చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ యోగేశ్‌ను ఆశ్రయించారు. ఇందుకు స్పందించిన ఆయన శంకర్‌పల్లి ఠాణాలో ఖురేషిపై ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిందూర్ విజయోత్సాహం

పాకిస్తాన్ టెర్రరిస్టు శిబిరాలను మట్టుబెట్టిన భారత త్రివిధ దళాలకు ఉపాధ్యాయులు సంఘీభావం తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న గణిత వృత్యంతర శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు ఆపరేషన్ సిందూర్ విజయోత్సవాలు జరుపుకొన్నారు. జాతీయ జెండాలు పట్టుకొని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో గణిత శిక్షణ తరగతుల కోర్స్ డైరెక్టర్ వెంకటేశం, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అంజిరెడ్డి, మహేంద్ర బహదూర్, ప్రతాప్, సత్యనారాయణరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, బసప్ప, సతీశ్‌కుమార్, గణిత రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

– అనంతగిరి



సింధూర్ విజయోత్సవాల్లో గణిత ఉపాధ్యాయులు

సమన్వయంతో సర్వే పూర్తి



అధికారులకు పొలం వివరాలు వెల్లడిస్తున్న రైతు

- పారిశ్రామికవాడ ఏర్పాటుకు భూములిచ్చిన రైతుల పొలాల పరిశీలన
- 138 మంది రైతుల నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్న అధికారులు

దుద్యాల్: మండల పరిధిలోని లగచర్ల, హకీంపేట్, పులిచర్లకుంట తండా గ్రామాల్లో పారిశ్రామిక వాడకు భూములు ఇచ్చిన 136 మంది రైతుల పొలాల్లో చేపట్టిన సర్వే శనివారంతో ముగిసింది. భూములు ఇచ్చిన రైతులకు సంబంధించిన పొలాల్లో ఆస్తులను గుర్తించారు. ఆర్‌అండ్‌బీ, హార్టికల్చర్, సెరీ కల్చర్, అటవీశాఖ, ఎక్సైజ్, భూగర్భ జలవనరుల శాఖ అధికారులు ఆయా శాఖల పరిధిలోని విలువైన ఆస్తులను అంచనాలు సిద్ధం చేశారు. వ్యవసాయ బోర్లు, పశువుల పాకలు, ఇళ్లు, మామిడి, బత్తాయి, నిమ్మ, దానిమ్మ, జామ తోటల వివరాలు సేకరించారు. ఈ వివరాలను కలెక్టర్‌కు నివేదించనున్నారు. రెవెన్యూ, పోలీస్ శాఖ సమన్వయంతో సాగిన ఈ సర్వే ఎలాంటి ఇబ్బందులు తావులేకుండా పూర్తయిందని తహసీల్దార్ కిషన్ తెలిపారు. సర్వేలో పరిగి సీఐ శ్రీనివాస్ రెడ్డి, కొడంగల్ ఎక్సైజ్ సీఐ వెంకటేశ్వర్లు, దుద్యాల్, కొడంగల్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్ ఎస్‌ఐలు యాదగిరి, సత్యనారాయణ, రావూఫ్, రవి గౌడ్‌లతో పాటు కానిస్టేబుల్‌లు, ప్రత్యేక పోలీసులు, మహిళా పోలీసులు, ఆర్‌ఐ నవీన్ కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



సర్వేకు రాకుండా కాపలా

పారిశ్రామిక వాడకు భూములు ఇచ్చిన రైతుల పొలాల్లో రెండు రోజులుగా సర్వేలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో పులిచర్లకుంట తండా సమీపంలో సర్వే జరుగుతుండగా రోటిబండ తండా గేట్ సమీపంలోని ఓ పొలంలో ఒంటరిగా కూర్చున్న మహిళను 'సాక్షి'పలకరించగా.. మా పొలంలోనూ సర్వే చేస్తారేమో అని కావలి కూర్చున్నాని బదులిచ్చింది. పేరు ప్రస్తావనకు నిరాకరించారు.

హక్కుల సాధనకు పోరాడుదాం

టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్

షాద్‌నగర్‌రూరల్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) పనిచేస్తోందని సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్ అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్ శివారులోని ఎన్‌హెచ్–44 హోటల్‌లో టీడబ్ల్యూజేఎఫ్ నాయకుడు మల్లేశ్ ఆధ్వర్యంలో వర్కింగ్ జర్నలిస్టుల డివిజన్ మహాసభ ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, ప్రధాన కార్యదర్శి సైదులు హాజరై మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యలపై పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. పాత్రికేయుల గుర్తింపు కార్డులు, ఇళ్ల స్థలాలువంటి హక్కులను సాధించుకోవాలని అన్నారు. జర్నలిస్టులు హక్కుల సాధనకు ఏకతాటిపైకి రావాలన్నారు. అనంతరం నియోజకవర్గ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా రాఘవేందర్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా శీనయ్య, వెంకటయ్య, రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా నరేష్, కోశాధికారిగా రమేష్, సహాయ కార్యదర్శిగా రామకృష్ణగౌడ్, సలహాదారులుగా గోపాల్, కార్యవర్గ సభ్యులుగా మల్లేశ్, మల్లి కార్జున్, నరేందర్‌గౌడ్, భాను, ప్రభాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నేషనల్ కౌన్సిల్ సభ్యులు దేవేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్. రమేష్, నాయకులు గణేష్, సురేష్, నర్సింహారెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రాంగ్‌రూట్‌లో లారీని ఢీకొట్టిన బైక్

ద్విచక్ర వాహనదారుడు మృతి

చేవెళ్ల: రాంగ్‌రూట్‌లో ప్రయాణించి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టిన ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. ఈ ఘటన చేవెళ్ల పీఎస్ పరిధిలోని మిర్జాగూడ సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. శనివారం పోలీసులు తెలిపిన ప్రకారం.. వికారాబాద్ జిల్లా పరిగి మండలం ఎర్రగడ్డపల్లి గ్రామానికి చెందిన రాజాపురం దేవరాజు (49) బైక్‌పై చేవెళ్ల వైపు ప్రయాణిస్తున్నాడు. మిర్జాగూడ సమీపంలోని మలుపు వద్ద ఎదురుగా చేవెళ్ల వైపు నుంచి వస్తున్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బైక్‌పై నుంచి పడిపోయిన దేవరాజ్ తలకు బలమైన గాయమై అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. అతని వద్ద లభించిన ఆధారాలతో కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి శనివారం పోస్ట్‌మార్టం నిర్వహించి కుటుంసభ్యులకు అప్పగించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏఎన్‌ఎంల డిప్యూటేషన్లు రద్దు

సాక్షి ఎఫెక్ట్..

ధారూరు: మండల పరిధిలోని నాగసమందర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి వివిధ పీహెచ్‌సీలకు వెళ్లిన ఏఎన్‌ఎంల డిప్యూటేషన్లు రద్దు చేస్తూ డీఎంహెచ్‌ఓ వెంకటరవణ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 21న 'సాక్షి' దినపత్రికలో 'డాక్టర్ లేని దవాఖాన' శీర్షికన వార్త ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన డీఎంహెచ్‌ఓ వారి డిప్యూటేషన్లను రద్దు చేశారు. నాగసమందర్ పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఏఎన్‌ఎం డి. విజయనిర్మల వికారాబాద్ మండలంలోని రామయ్యగుడ పీహెచ్‌సీకి, కుక్కింద పల్లె దవాఖానలో ఏఎన్‌ఎం ఎన్.అంజిలమ్మ ధారూరు పీహెచ్‌సీకి, మరో ఏఎన్‌ఎం మహబూబ్ బీ జిన్‌గుర్తికి డిప్యూటేషన్లపై వెళ్లారు. వీరంతా వెంటనే నాగసమందర్ పీహెచ్‌సీలో మంగళవారం వరకు విధుల్లో చేరాలని శనివారం డీఎంహెచ్‌ఓ ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బంట్వారం ఎస్‌ఐగా విమల



బంట్వారం: వికారాబాద్ పీఎస్ నుంచి బదిలీ పై బంట్వారం ఎస్‌ఐగా వచ్చిన విమల శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన శ్రీశైలం యాదవ్ వికారాబాద్ పీఎస్‌కు వెళ్లారు. నూతన ఎస్‌ఐ విమల మాట్లాడుతూ.. నేరాల నియంత్రణకు శక్తి వంచన లేకుండా పని చేస్తానన్నారు. అలాగే శాంతి భద్రతలను కాపాడటమే తమ కర్తవ్యమన్నారు. ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు పోలీసులకు సహకరించాలని ఆమె కోరారు.

ఫిర్యాదుదారుల నుంచి ఫీడ్‌బ్యాక్

బాలాపూర్ ఠాణాను సందర్శించిన డీసీపీ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న డీసీపీ సునీతా రెడ్డి

మహేశ్వరం: మహేశ్వరం డీసీపీ డి.సునీతా రెడ్డి శనివారం బాలాపూర్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో ముచ్చటించారు. ఏ విషయంలో ఫిర్యాదు చేసేందుకు వచ్చారు.. ఫిర్యాదు స్వీకరించడంలో రిసెప్షనిస్ట్ ఎలా వ్యవహరించారు.. స్టేషన్ అధికారులు ఎలా స్పందించారు.. అంటూ వారి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. అనంతరం ఆమె స్టేషన్ పరిధిలో ఏ తరహా నేరాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయనే విషయమై స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఇన్‌స్పెక్టర్) సుధాకర్‌ను ఆరా తీశారు. పెండింగ్ కేసుల దర్యాప్తు ఏ విధంగా కొనసాగుతోందని అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం జరుగుతుందన్న భరోసా కలిగించాలని సూచించారు. సున్నితమైన ప్రాంతాల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు. బక్రీద్ పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో గోవుల రవాణాపై నిఘా ఉంచాలన్నారు. ఆమె వెంట మహేశ్వరం ఏసీపీ పి.లక్ష్మీకాంత రెడ్డి ఉన్నారు.

షెడ్ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయండి



నిలిచిపోయిన నిర్మాణాలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని రైతుబజార్ ఆవరణలో నిర్మిస్తున్న షెడ్‌ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సీపీఎం నాయకులు అక్కడికి వెళ్లి కూరగాయాలు విక్రయిస్తున్న రైతులతో మాట్లాడారు. నిర్మాణాలను అర్ధాంతరంగా వదిలేస్తే ఎలా అని ఆయన ప్రశ్నించారు. వర్షాలు కురవడంతో రైతులు నిత్యం కూరగాయలు విక్రయిస్తూ వానలో తడవంతో పాటు కూరగాయలు తడిసిపోయి తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ విషయంలో కలెక్టర్ వెంటనే స్పందించి నిర్మాణాలను ప్రారంభించి వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, రైతులు తదితరులు ఉన్నారు.

శుభకార్యానికి వెళ్తూ మృత్యువాత

- గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకుల దుర్మరణం
- యాచారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఘటన
- కేసు నమోదు చేసిన పోలీసులు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బైక్



అరుణ్ (ఫైల్)



అశోక్ (ఫైల్)

యాచారం: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందారు. యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. కడ్తాల్ మండలం పల్లెచల్కతండాకు చెందిన విస్లావత్ అశోక్(22), నల్గొండ జిల్లా కొండపల్లెపల్లి మండలం దంజాలాల్‌తండాకు చెందిన రమావత్ అరుణ్(24) బావబామ్మర్దులు. పల్లెచల్కతండాలో ఓ శుభకార్యానికి హాజరయ్యేందుకు శుక్రవారం అర్ధరాత్రి 12:30 గంటలకు బైక్‌పై నగరం నుంచి బయల్దేరారు. యాచారం ఎంపీడీఓ కార్యాలయ సమీపంలోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద గుర్తు తెలియని వాహనం వీరిని ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన అరుణ్ అక్కడికక్కడే మృతిచెందగా తీవ్రగాయాలైన అశోక్‌ను 108లో హైదరాబాద్ తరలిస్తుండగా చనిపోయాడు. వీరు ప్రయాణిస్తున్న రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనం నుజ్జునుజ్జయింది. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు శుక్రవారం రాత్రి 11- 30 నుంచి 12:30 గంటల వరకు సాగర్ రోడ్డుపై రాకపోకలు సాగించిన వాహనాల సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

అమ్మో ఆడబిడ్డా..!

- కడుపులో ఉన్నది ఆడపిల్ల అని తెలిస్తే చాలు అబార్షన్లు
- ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్న కొన్ని డయాగ్నోస్టిక్స్
- గతేడాది బాలబాలికల జనన నిష్పత్తిలో భారీ వ్యత్యాసం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పుత్రుడు మాత్రమే పున్నాగ నరకం నుంచి తప్పిస్తాడనే విశ్వాసం.. తన తర్వాత వంశం అంతరించిపోకుండా కాపాడతాడనే నమ్మకం .. ఆడపిల్ల పుడితే తనతోనే వంశం అంతరించిపోతుందనే భయం.. ఉన్నత చదువులు, పెళ్లిళ్లు, కట్నకానుకల పేరుతో మోయలేని ఆర్థిక భారాన్ని మోయాల్సి వస్తుందన్న అభద్రతాభావం.. వెరసి పురిట్లోనే ఆడబిడ్డలను నులిమేస్తున్నారు. కడుపులో ఉన్నది ఆడబిడ్డ అని తెలిస్తే చాలు కనికరం కూడా లేకుండా అబార్షన్లు చేయించేస్తున్నారు. కన్ను తెరవకముందే కాటికిపంపుతున్నారు. ఫలితంగా బాలబాలిక నిష్పత్తిలో భారీ వ్యత్యాసం నమోదవుతోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో ప్రతి వెయ్యి మంది బాలురకు 950 మంది బాలికలు ఉండగా, ప్రస్తుతం ఈ సంఖ్య మరింత తగ్గడం ఆందోళన కలిగిస్తోంది. కేవలం 14 ఏళ్లలోనే ఈ నిష్పత్తి 25 శాతానికి పడి పోవడం పరిస్థితికి అద్దం పడుతోంది.

ఆడో, మగో చెప్పేస్తున్నాయి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నుంచి గుర్తింపు పొందిన స్పెషాలిటీ, మల్టీ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ, జనరల్ నర్సింగ్‌హోమ్స్, పీడియాట్రిక్ క్లినిక్స్, ఈఎన్‌టీ, కంటి ఆస్పత్రులు, డెంటల్ క్లినిక్స్ 1,250 వరకు ఉన్నట్లు అంచనా. వీటిలో 350 వరకు డయాగ్నోస్టిక్స్ ఉన్నాయి. రక్త, మూత్ర పరీక్షలతో పాటు ఎముకల ధృడత్వం, శరీరంలోని వివిధ అంతర్గాత అవయవాల పనితీరును పరీక్షించాల్సిన డయాగ్నోస్టిక్స్ సెంటర్లు కాసులకు కక్కుర్తి పడి కడుపులో ఉన్నది ఆడో, మగో చెప్పేస్తున్నాయి. అప్పటికే ఇద్దరు ముగ్గురు ఆడపిల్లలు ఉన్న తల్లిదండ్రులు మళ్లీ ఆడబిడ్డే పుట్టనుందని తెలిసి అబార్షన్లు చేయించుకుంటున్నారు. మరికొంత మంది ఏకంగా మగ పిల్లలు మాత్రమే కనాలని కండిషన్లు పెడుతున్నారు. తల్లిదండ్రుల్లో ఉన్న బలహీనతను డయాగ్నోస్టిక్స్ యాజమాన్యాలు క్యాష్ చేసుకుంటున్నాయి. చేవెళ్ల, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, యాచారం, ఆమనగల్లు, బాలాపూర్, మీర్‌పేట, బడంగ్‌పేట్, శివరాంపల్లి, శేరిలింగంపల్లి, నార్సింగి, తుక్కుగూడ, మహేశ్వరం, తుర్కయంజాల్, పెద్ద అంబర్‌పేట తదితర ప్రాంతాల్లోని ల్యాబ్‌లు వైద్య పరీక్షల పేరుతో అడ్డదారులు తొక్కుతున్నాయి. పరోక్షంగా ఆడపిల్లల నిష్పత్తి తగ్గిపోవడానికి కారణమవుతున్నాయి. ఎప్పటికప్పుడు ఆయా సెంటర్లను తనిఖీ చేయాల్సిన వైద్యాధికారులు అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోవడం లేదు.

చిరునామాలూ గల్లంతు!

- బోగస్ బర్త్ సర్టిఫికెట్ల బాగోతం
- చర్యలు లేనందునే ఆగని 'దందా'

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పరిధిలో జారీ అవుతున్న బర్త్, డెత్ సర్టిఫికెట్లలో అవకతవకలు, అక్రమాల గురించి ఎంతో కాలంగా వెల్లడవుతున్నప్పటికీ, తగిన కట్టడి చర్యలు లేనందున వాటికి అడ్డుకట్ట పడలేదని తెలుస్తోంది. తాజాగా టోలిచౌకిలోని మూతపడిన మెట్రో హాస్పిటల్ నుంచి 65 నకిలీ బర్త్, 8 నకిలీ డెత్‌సర్టిఫికెట్లను గుర్తించి రద్దు చేసినట్లు ప్రకటించిన జీహెచ్‌ఎంసీ.. రెండున్నరేళ్ల క్రితం దాదాపు 25వేల బర్త్ సర్టిఫికెట్ల జారీలో అవకతవకలు జరిగాయని గుర్తించి, వాటన్నింటినీ రద్దు చేసినట్లు ప్రకటించింది. ఈ మేరకు పాస్‌పోర్ట్, ఇతరత్రా ప్రభుత్వ విభాగాలకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొంది. బాధ్యులపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియదు. చర్యల లేమితోనే బోగస్ బాగోతానికి అడ్డుకట్ట పడలేదని తెలుస్తోంది. అప్పట్లో జారీ అయిన సర్టిఫికెట్లు నాన్ అవైలబిలిటీ (జననాలు ఆస్పత్రుల్లో జరగనివి) కింద దరఖాస్తు చేసుకున్నవి కాగా, తాజాగా గుర్తించినవి ఆస్పత్రులు తప్పుడు సమాచారం ఇవ్వడంతో జారీ అయినవి. ఆస్పత్రులపై అధికారులు దృష్టి సారించనందునే ఇవి జారీ అయినట్లు తెలుస్తోంది. ఇంకా ఎన్ని ఆస్పత్రుల్లో ఇలాంటి తతంగాలు జరిగాయో అంతు చిక్కని అంశంగా మారింది.

ప్రత్యేకంగా 'సిట్' ఏర్పాటు..

అప్పటి బోగస్ సర్టిఫికెట్లకు సంబంధించి జీహెచ్‌ఎంసీ అధికారులు వివిధ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో కేసులు కూడా నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వాటి నిగ్గు తేల్చేందుకు పోలీసులు ప్రత్యేకంగా 'సిట్' ఏర్పాటు చేసినట్లు సమాచారం. తాజాగా నకిలీ బర్త్ సర్టిఫికెట్ల బాగోతం బయట పడటంతో గతంలో పాతబస్తీలోని ఒక మీ సేవ కేంద్రం నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న దాదాపు 250 బర్త్ సర్టిఫికెట్లకు సంబంధించి అవి ఒరిజినల్‌వా, లేక నకిలీవా తెలియజేయాల్సిందిగా జీహెచ్‌ఎంసీ అధికారులను తాజాగా కోరినట్లు తెలిసింది. ఒకవేళ నిజమైనవే అయితే సర్టిఫికెట్లు పొందేందుకు వారు జతచేసిన పత్రాలు, దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు తదితరమైనవి తెలియజేయాల్సిందిగా కోరినట్లు సమాచారం.

➡ ఈ నేపథ్యంలో అప్లికేషన్ నెంబర్ల ఆధారంగా ఆన్‌లైన్‌లో పరిశీలించిన జీహెచ్‌ఎంసీ యంత్రాంగం ఎలాంటి ధ్రువపత్రాలు లేకపోవడమే కాక దరఖాస్తు చేసుకున్న వారి చిరునామా కూడా లేకపోవడాన్ని గుర్తించినట్లు తెలిసింది.బర్త్ సర్టిఫికెట్లు అవసరమైన వారి నుంచి అధిక మొత్తాలు వసూలు చేసి వాటిని ఇప్పించేందుకు అలవాటు పడ్డ కొన్ని మీసేవా కేంద్రాల నిర్వాహకులు, తదితరులు కుమ్మక్కై నాన్ అవైలబిలిటీ కింద దరఖాస్తు చేయించి వాటిని జారీ చేశారనే అభిప్రాయాలున్నాయి. అప్పట్లో జారీ అయిన వాటికి సంబంధించి బాధ్యులపై ఇప్పటి దాకా తగిన చర్యలు లేనందునే వివిధ మార్గాల్లో నకిలీ సర్టిఫికెట్లు జారీ అవుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గతంలో అక్రమాలిలా ..

ఆస్పత్రుల్లో జరిగే జనన, మరణాల రిపోర్టుల ఆధారంగా సదరు ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తారు. ఆస్పత్రుల్లో కాకుండా జరిగే జనన, మరణాలకు నాన్ అవైలబిలిటీగా పేర్కొంటూ ఆర్‌డీఓ జారీ చేసే ప్రొసీడింగ్స్‌ను బట్టి సర్టిఫికెట్లు జారీ చేస్తారు. ఆర్‌డీఓ జారీ చేసే పత్రాల బదులు వివిధ రకాల నకిలీ పత్రాలు, తెల్లపేపర్లు సైతం అప్‌లోడ్ చేసినా బర్త్, డెత్ సర్టిఫికెట్లు జారీ అయినట్లు గుర్తించారు.

రెక్కీ చేసి.. పక్కాగా చోరీ

- పోలీసులకు సవాల్ విసురుతున్న దొంగలు
- ఆందోళనకు గురవుతున్న ప్రజలు



కమ్మగూడలో రెక్కీ నిర్వహిస్తున్న దుండగుడు

తుర్కయంజాల్: ఆదిబట్ల, వనస్థలిపురం పరిధిలోని కాలనీల్లో దొంగలు హల్‌చల్ చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు సాధారణమయ్యాయి. వేసవి సెలవులు, పెళ్లిళ్లు, ఫంక్షన్ల సీజన్ కావడంతో దుండగులు తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తున్నారు. ఇటీవల బయపడిన సీసీ టీవీ పుటేజీలు ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. ముందు ద్విచక్రవాహనాలపై రెక్కీ నిర్వహిస్తున్న దుండగులు ఆ తర్వాత తాళం వేసిన ఇళ్లకు కన్నం వేస్తున్నారు.

చోరీకి విఫలయత్నం

రాగన్నగూడలోని వెస్ట్ సూరజ్‌నగర్ కాలనీలో ఈ నెల 22న ఉదయం 11.45 గంటల సమయంలో ఇద్దరు యువకులు పసుపు రంగు ఎలక్ట్రిక్ వాహనంపై రెక్కీ నిర్వహించారు. సుమారు 20 నిమిషాల తర్వాత ద్విచక్ర వాహనాన్ని మరో చోట పార్క్ చేసి రోడ్ నంబర్–5లో ఓ ఇంట్లో చోరీకి యత్నించారు. బీరువా లాకర్ తెరిచేందుకు యత్నింగా అది ఓపెన్ కాలేదు. పై అంతస్తులో నివాసం ఉండేవారు కిందికి రాగా దుండగులు వారిని తోసేసుకుంటూ అక్కడ నుంచి పలాయనం చిత్తగించారు. ఇంటి యజమానులు పోలీసలకు సమాచారం ఇవ్వడంతో అక్కడకు చేరుకుని పాటోలు తీసుకుని వెళ్లిపోయారు. రెండు రోజులు గడుస్తున్నా పోలీసుల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో శనివారం ఆదిబట్ల ఠాణాలో ఫిర్యాదు చేశారు.



వెస్ట్ సూరజ్ నగర్‌లో ఎలక్ట్రిక్ వాహనంపై రెక్కీ చేస్తున్న ఇద్దరు..

పికెటింగ్‌ను దాటుకుని..

ఈ నెల 15న కమ్మగూడలోని శివాజీ నగర్ కాలనీలో సాయంత్రం 4 గంటల సమయంలో ఓ స్కూటీపై వచ్చిన యువకుడు ఇళ్లను గమనిస్తూ రెక్కీ నిర్వహించాడు. అనంతరం కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే రోడ్డులోని ఓ ఇంటికి తాళం వేసి ఉండడంతో గోడ దూకి ఇంట్లోకి ప్రవేశించాడు. తాళం తెరిచేందుకు విఫలయత్నం చేసి ఇంటి ఆవరణలోని నల్లాలను, వస్తువులను ధ్వంసం చేసి వెనుదిరిగాడు. సీసీలో పరిశీలించగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఇదే కాలనీలో పోలీస్ పికెటింగ్ ఉన్నప్పటికీ చోరీకి యత్నించడం చర్చనీయాంశంగా మారింది.

పెట్రోలింగ్ పెంచాం

సీసీ టీవీ పుటేజీల ఆధారంగా దొంగలను గుర్తించే పనిలో ఉన్నాం. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు కాలనీల్లో అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. పెట్రోలింగ్ పెంచి భద్రతా కల్పిస్తున్నాం.

– రాఘవేందర్ రెడ్డి,సీఐ, ఆదిబట్ల